దళారులను ఆశ్రయించొద్దు

తాడూరు: రైతులు వరిధాన్యాన్ని కొనుగోలు కేంద్రాల్లోనే విక్రయించాలని దళారులను ఆశ్రయించి మోసపోవద్దని ఎమ్మెల్యే డా రాజేష్‌రెడ్డి అన్నారు. బుధవారం మండలంలోని చర్లటిక్యాలలో వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఎమ్మెల్యే ప్రారంభించి మాట్లాడారు. ప్రభుత్వం ప్రతి గింజను కొనుగోలు చేస్తుందని రైతులు అధైర్యపడొద్దన్నారు. సన్నవడ్లకు రూ.500 బోనస్ ప్రకటించిందన్నారు. రైతుల ధాన్యం కొనుగోలులో అక్రమాలకు పాల్పడితే సహించమని హెచ్చరించారు. రైతు సంక్షేమానికి సీఎం రేవంత్‌రెడ్డి నిరంతరం కృషి చేస్తున్నారన్నారు. కార్యక్రమంలో సింగిల్‌విండో చైర్మన్ రామచంద్రారెడ్డి, సీఈఓ ఆంజనేయులు, ఏఓ సందీప్‌రెడ్డి, వైస్ చైర్మన్ వెంకట్‌రెడ్డి, డిప్యూటీ తహసీల్దార్ మహమ్మద్‌అలీ, ఎంపీఓ బ్రహ్మచారి, గ్రామస్తులు వెంకట్‌రెడ్డి, రామకృష్ణ, సత్యంగౌడ్, బాల్‌రెడ్డి, ఆయా గ్రామాల రైతులు పాల్గొన్నారు.

ముదిరాజ్‌లకు అండగా ఉంటా

నాగర్‌కర్నూల్: నియోజకవర్గంలో ముదిరాజ్‌లకు అన్ని విధాల అండగా ఉంటానని ఎమ్మెల్యే కూచుకుళ్ల రాజేష్‌రెడ్డి అన్నారు. మండలంలోని పెద్ద ముద్దనూరులో ముదిరాజ్ సంఘం భవనాన్ని ఎమ్మెల్యే ప్రారంభించి మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముదిరాజులు ప్రభుత్వం ప్రవేశపెట్టిన పథకాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో జిల్లా ముదిరాజ్ సంఘం నాయకులు, సంబధిత అధికారులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



వరిధాన్యాన్ని తూకం చేస్తున్న ఎమ్మెల్యే రాజేష్‌రెడ్డి

క్లుప్తంగా

పోస్టర్ విడుదల



ఊర్కొండ: మండల కేంద్రంలో ఈ నెల 22న నిర్వహించనున్న షరీఫ్ దర్గా ఉర్సు ఉత్సవాలకు సంబంధించి పోస్టర్లను బుధవారం ఎమ్మెల్యే జనంపల్లి అనిరుధ్ రెడ్డి విడుదల చేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ వర్కింగ్ ప్రెసిడెంట్ ధ్యాప నిఖిల్ రెడ్డి, కాంగ్రెస్ నాయకులు అబ్దుల్ సమీ, రమేష్ నాయక్, వహిదోద్దీన్ మనోహర్ రెడ్డి, చంద్రకాంత్, మాసుమ్, శ్రీశైలం ఉర్సు కమిటీ సభ్యులు షర్ఫుద్దీన్, షబ్బీర్, ఆరీఫ్ పాల్గొన్నారు.

27 మాలల ఆత్మగౌరవ సభ

తాడూరు: హలో మాల చలో నాగర్‌కర్నూల్ మాలల ఆత్మగౌరవ సభను ఈ నెల 27న నిర్వహిస్తునట్లు మాలలు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని మాల మహానాడు గౌరవ మండల అధ్యక్షుడు జెట్టి చంద్రయ్య, జిల్లా నాయకుడు మద్దెల చంటి కోరారు. బుధవారం మండలంలోని మేడిపూర్‌లో నిర్వహించిన ర్యాలీలో ఆయన పాల్గొని మాట్లాడారు. ప్రతి గ్రామం నుంచి మాలలు తరలిరావాలన్నారు. కార్యక్రమంలో నాయకులు నారాయణ, బాలకృష్ణయ్య, తిరుపతయ్య, మురళి, శివశంకర్, వేణుగోపాల్, కురుమయ్య తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా వాల్మీకి జయంతి

పెంట్లవెల్లి: మండలంలోని కొండూరు, గోపులాపురం గ్రామాల్లో వాల్మీకి జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. కొండూరులో వాల్మీకి విగ్రహ ప్రతిష్ఠ ఉత్సవంలో భాగంగా బుధవారం బొడ్డెమ్మలు ఆడుతూ, పాటలు పాడుతూ పురవీధుల గుండా విగ్రహాన్ని ఊరేగించారు. ఈ సందర్భంగా గ్రామస్తులు ప్రత్యేక పూజలు చేశారు. గురువారం గ్రామంలో విగ్రహాన్ని ప్రతిష్ఠించనున్నట్లు కొండూరు గ్రామస్తులు తెలిపారు. కమిటీ పెద్దలు, గ్రామస్తులు మాజీ సర్పంచ్ నల్లపోతుల గోపాల్, రెడ్డిరవి, రెడ్డిరాము, మాజీ ఎంపీటీసీ వెంకటేశ్వర్లు, విజయ్ పాల్గొన్నారు.

దళితులపై దాడి హేయనీయం

తాడూరు: నవరాత్రి ఉత్సవాలలో భాగంగా నృత్యాలు చేస్తున్న దళితులపై దాడి చేయడం హేయనీయమని కేవీపీఎస్ జిల్లా అధ్యక్షుడు కాశన్న అన్నారు. బుధవారం దాడి చేసిన వారిని గుర్తించి కఠినంగా శిక్షించాలని కోరుతూ తహసీల్దార్ కిరణ్మయికి వినతిపత్రం అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ మండలంలో పాపగల్‌లో అమ్మవారి ఊరేగింపులో దళితులు నృత్యాలు చేస్తుంటే అకారణంగా కొందరు దాడి చేశారని వివరించారు. ఈ ఘటనలో దళితులు గాయపడి ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారని పేర్కొన్నారు. నిందితులపై కేసు నమోదు చేసి శిక్షించాలన్నారు. కార్యక్రమంలో నాయకులు మహేష్, రాజు, బీమయ్య, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

పేద విద్యార్థులకు అండగా ఉంటాం

అచ్చంపేట రూరల్: పేద విద్యార్థులకు అండగా ఉంటామని సుదర్శన్ ఎడ్యుకేషన్ సొసైటీ ఫౌండర్ గార్లపాటి సుదర్శన్ అన్నారు. బుధవారం పట్టణంలో ఇద్దరు పేద విద్యార్థినులకు ఆర్థికసాయం అందజేశారు. ఎంబీబీఎస్ చదువుతున్న బల్మూర్ మండలం అంబగిరికి చెందిన సుప్రియకు రూ. 25వేలు, బీఈడీ చదువుతున్న పట్టణంలోని వలపట్లకు చెందిన వరమ్మకు రూ. 50వేలు ఆర్థికసాయం చేశారు. విద్యార్థులు చదువుల్లో రాణించి ఉన్నత శిఖరాలకు ఎదగాలని కోరారు. కార్యక్రమంలో రఘురాం, నరేష్ పాల్గొన్నారు.

దామాషా ప్రకారం రిజర్వేషన్లు వర్తింపజేయాలి



నాగర్‌కర్నూల్‌రూరల్: రాష్ట్రంలో బీసీ కులగణన తర్వాత జనాభా దామాషా ప్రకారం విద్యా, ఉద్యోగ, రాజకీయాల్లో రిజర్వేషన్లు వర్తింపజేయాలని బీసీ సంఘం జిల్లా అధ్యక్షుడు వెంకటేశ్వర్‌రావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బుధవారం బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్‌గౌడ్ పిలుపుమేరకు అంబేడ్కర్ విగ్రహానికి పుష్పాభిషేకం నిర్వహించారు. ఈ సందర్భంగా వెంకటేశ్వర్‌రావు మాట్లాడుతూ రాష్ట్రంలో సమగ్ర కులగణన చేపట్టాలన్నారు. కులగుణన కోసం ప్రభుత్వం జీఓ నంబర్ 18ని విడుదల చేయడం సంతోషకరమన్నారు. కార్యక్రమంలో సంఘం నాయకులు రాజుగౌడ్, పెద్దయ్యనాయుడు, శివుడు, సంతోష్, మద్దిలేటయ్య, ఇక్బాల్, రామారావు, నాగరాజు, వీరేష్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

అక్రమ నిర్మాణాల కూల్చివేత


పోలీసు బందోబస్తు మధ్య దుకాణాలను తొలగిస్తున్న కార్యదర్శి భీముడు

మన్ననూర్: శ్రీశైలం–హైదరాబాద్ ప్రధాన రహదారి మన్ననూర్‌లోని ప్రభుత్వ గిరిజన ఉన్నత పాఠశాల ఎదుట అక్రమ నిర్మాణాలను గ్రామ పంచాయతీ సమక్షంలో బుధవారం కూల్చివేశారు. గ్రామానికి చెందిన నయిముల్లా షరీఫ్ టీ జంక్షన్, ఓం ప్రకాష్ జనరల్ షాపులు ప్రభుత్వ స్థలంలో అక్రమంగా ఏర్పాటు చేశారు. గతంలో పంచాయతీ తరుపున దుకాణ యజమానులకు నోటీసులు కూడా ఇచ్చారు. అయినప్పటికి దుకాణాలు తొలగించకపోవడంతో ఉన్నతాధికారుల సూచనలు, పంచాయరాజ్ చట్టం 2018 సెక్షన్ 114 ప్రకారం అక్రమ నిర్మాణాలు కూల్చివేసినట్లు కార్యదర్శి భీముడు తెలిపారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా పోలీసులు కట్టుదిట్టమైన చర్యలు తీసుకున్నారు.

తెగుళ్ల నివారణతో అధిక దిగుబడి

ఉప్పునుంతల: తెగుళ్ల నివారణతో అధిక దిగుబడి సాధ్యమని ఏఓ రమేష్ అన్నారు. బుధవారం మండలంలోని మర్రిపల్లి క్లస్టర్‌లోని మర్రిపల్లి, లక్ష్మాపూర్, పెద్దాపూర్ గ్రామాల్లో రైతులు సాగుచేసిన వేరుశనగ, వరి పంటతోపాటు మిర్చి తోటలను ఆయన క్షేత్రస్థాయిలో పరిశీలించారు. వేరుశెనగపంటకు వేరుకుళ్లు తెగులు ఆశించి మొక్కలు చనిపోతున్నట్లు గుర్తించారు. ఈ తెగులు నివారణ కోసం కార్బండజిమ్, మంకోజెబ్ మందును 400 గ్రాములు 200ల లీటర్ల నీటిలో కలిపి ఒక ఎకరా పంటపై పిచికారీ చేసుకోవాలని రైతులకు సూచించారు. అదేవిధంగా వరి పంటకు ఆశించిన కాండం తొలుచు పురుగు నివారణ కోసం 400ల మిల్లీలీటర్ల కార్టాప్‌హైడ్రోక్లోరైడ్ మందును 200ల లీటర్ల నీటిలో కలిపి ఎకరా పొలంలో ఉన్న పంటపై పిచికారీ చేసుకోవాలని కోరారు. మిర్చిపంటకు ఆశించిన ఆకుముడత తెగులు నివారణపై అవగాహన కల్పించారు. క్లస్టర్ ఏఈఓ రాగసంధ్య పాల్గొన్నారు.


పెద్దాపూర్ శివారులో వేరుశనగ పంటను పరిశీలిస్తున్న ఏఓ రమేష్, ఏఈఓ

వేతనాలు చెల్లించాలని ఎంపీడీఓకు వినతి


ఎంపీడీఓకు వినతిపత్రం ఇస్తున్న కార్మికులు

పెద్దకొత్తపల్లి: మండలంలోని గ్రామ పంచాయతీలలో పనిచేస్తున్న పంచాయతీ కార్మికులకు పెండింగ్‌లో ఉన్న వేతనాలను చెల్లించాలని కోరుతూ సీఐటీయూ ఆధ్వర్యంలో ఎంపీడీఓ నాగేంద్రానికి బుధవారం వినతిపత్రం అందజేశారు. సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి దశరథం మాట్లాడుతూ గ్రామ పంచాయతీలో పనిచేస్తున్న కార్మికులకు నాలుగు నెలలుగా వేతనాలు రాకపోవడంతో వారి జీవితాలు దుర్భరంగా మారయన్నారు. కార్మికులకు కనీస వేతన చట్టం కింద రూ.26 వేల వేతనం ఇవ్వాలని కోరారు. మల్టీపర్పస్ విధానం రద్దు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో గ్రామ పంచాయతీ వర్కర్ల మండల అధ్యక్షుడు బాలస్వామి, ఉపాధ్యక్షుడు సిద్ధయ్య, రాజేందర్, రాంబాబుగౌడ్, లక్ష్మమ్మ, లక్ష్మి, వెంకటయ్య, ఎల్లమ్మ, మల్లయ్య, ఆశన్నలు పాల్గొన్నారు.

ఫీజు బకాయిలను వెంటనే చెల్లించాలి

కల్వకుర్తిరూరల్: విద్యార్థులకు చెల్లించాల్సిన ఫీజు బకాయిలను వెంటనే చెల్లించాలని బీఆర్‌ఎస్‌వీ మండల అధ్యక్షుడు గణేష్ డిమాండ్ చేశారు. బుధవారం పట్టణంలో సంఘం ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఫీజులు చెల్లించని కారణంగా విద్యార్థులకు సర్టిఫికెట్లు ఇవ్వడం లేదని వాపోయారు. కార్యక్రమంలో శేఖర్‌గౌడ్, కృష్ణ, అల్లుడు కృష్ణ, పరశురాములు, రమేష్, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

కొల్లాపూర్: ఇంటర్, డిగ్రీ కళాశాలలకు చెల్లించాల్సిన ఫీజు బకాయిలు వెంటనే చెల్లించాలని బీఆర్‌ఎస్‌వీ జిల్లా నాయకులు డి.శేఖర్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బుధవారం ఆయన పట్టణంలోని ఆర్‌ఐడీ ప్రభుత్వ బాలుర జూనియర్ కళాశాలలో విద్యార్థులతో మాట్లాడారు. విద్యారంగ సమస్యల పరిష్కారం కోసం బీఆర్‌ఎస్‌వీ ఆధ్వర్యంలో పోరాటాలు చేస్తామన్నారు. కార్యక్రమంలో భాస్కర్, వినోద్, చరణ్, అజయ్‌కుమార్, మహేష తదితరులున్నారు.


కొల్లాపూర్‌లో మాట్లాడుతున్న శేఖర్

పెంట్లవెల్లి: పెండింగ్‌లో ఉన్న ఫీజురీయింబర్స్‌మెంట్ వెంటనే విడుదల చేయాలని ఎస్‌ఎఫ్‌ఐ డివిజన్ అధ్యక్షుడు తరుణ్ అన్నారు. బుధవారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు.

సమాచార హక్కు చట్టం ఎంతో ఉపయోగకరం


కేక్ కట్ చేస్తున్న ప్రశాంత్

కల్వకుర్తి: సమాచార హక్కు చట్టం అందరికి ఉపయోగకరంగా ఉంటుందని ఆ చట్టం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ ప్రశాంత్ అన్నారు. బుధవారం పట్టణంలోని న్యాయవాదుల భవనంలో సమాచార హక్కు రక్షణ చట్టం ఆవిర్భావ దినోత్సవ వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన కేక్ కట్ చేసి పంపిణీ చేశారు. నవంబర్ 3న కల్వకుర్తిలో రాష్ట్రస్థాయి సదస్సు నిర్వహిస్తునట్లు పేర్కొన్నారు. సమావేశానికి రాష్ట్రంలోని 33 జిల్లాల ప్రతినిధులు పాల్గొంటారన్నారు. అశోక్, అనంతరాములు, గణేష్, బాలస్వామి, మొగులయ్య, సంతోష్‌తో పాటు డివిజన్ పరిధిలోని సభ్యులు పాల్గొన్నారు.

ఉమామహేశ్వర ఆలయ అభివృద్ధికి కృషి

అచ్చంపేట రూరల్: ఉమామహేశ్వర దేవాలయ అభివృద్ధికి కృషి చేస్తానని ఆలయ కమిటీ చైర్మన్ భీరం మాధవరెడ్డి అన్నారు. బుధవారం హైదరాబాద్ వనస్థలిపురానికి చెందిన డాక్టర్ మధుమూర్తి, గాయత్రి దంపతులు ఆలయాభివృద్ధి కోసం రూ. 64వేలు విరాళంగా ఇవ్వడంతో దాతలను ఆయన సన్మానించారు. అనంతరం చైర్మన్ మాధవరెడ్డి మాట్లాడుతూ భక్తులకు ఎటువంటి అసౌకర్యం లేకుండా చర్యలు తీసుకుంటామన్నారు. ఆలయాభివృద్ధికి దాతలు సహకరించాలన్నారు. కార్యక్రమంలో ఈఓ శ్రీనివాసరావు, కమిటీ సభ్యులు పవన్, సైదులు, ఆలయ సిబ్బంది రామకృష్ణ, అర్చకులు పాల్గొన్నారు.


ఆలయ సిబ్బందికి విరాళం అందిస్తున్న దాతలు

విద్యుత్ ఏఈగా సాయన్న గౌడ్

ఊర్కొండ: మండల విద్యుత్ ఏఈగా సాయన్న గౌడ్ బుధవారం బాధ్యతలు స్వీకరించారు. తిమ్మాజిపేట మండల విద్యుత్ ఏఈగా పనిచేసి ఇటీవలే ఊర్కొండ మండలానికి బదిలీపై వచ్చారు. ఊర్కొండ మండల ఏఈగా పనిచేసిన రమణి జిల్లా కేంద్రానికి బదిలీపై వెళ్లారు.

ఏఓగా అనిల్..

లింగాల: మండల వ్యవసాయాధికారిగా జి.అనిల్ బుధవారం బాధ్యతలు చేపట్టారు. ఇక్కడ పనిచేసిన ఏఓ నాగార్జునరెడ్డి రెండు నెలల కిందట అలంపూర్ మండలానికి బదిలీ అయ్యారు. సిబ్బంది, నాయకులు నూతన ఏఓకు శుభాకాంక్షలు తెలిపి సన్మానించారు.

బాధిత కుటుంబానికి ఎమ్మెల్యే పరామర్శ



మన్ననూర్: ఇటీవల గ్రామానికి చెందిన కాంగ్రెస్ కార్యకర్త దుమర్ల లక్ష్మయ్య (45) గుండెపోటుతో మృతి చెందాడు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే డాక్టర్ వంశీకృష్ణ బాధిత కుటుంబాన్ని పరామర్శించి ఓదార్చారు. అన్ని విధాలా అండగా ఉంటానని భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో రాధాకృష్ణ, లక్ష్మణ్, రవి, నాయకులు మల్లికార్జున్, కృష్ణగోపాల్, లింగం, శ్రీనివాసులు, బాలు, ఎల్లస్వామి తదితరులు పాల్గొన్నారు.

ఎల్‌ఐసీ ఏజెంట్ల ధర్నా



కల్వకుర్తిరూరల్: పట్టణంలోని ఎల్‌ఐసీ కార్యాలయం ఎదుట ఎల్‌ఐసీ ఏజెంట్లు బుధవారం ధర్నా నిర్వహించారు. హైదరాబాద్ డివిజన్ లియాపి పిలుపు మేరకు పాలసీదారులకు బోనస్ పెంచాలని జీఎస్టీ టాక్స్ తొలగించాలనే డిమాండ్‌తో ధర్నా చేపట్టారు. ఏజెంట్ల సమస్యలు, పాలసీదారుల సమస్యలు పరిష్కరించాలని ప్రభుత్వాన్ని కోరారు. ఈ కార్యక్రమంలో ఏజెంట్‌ల సంఘం నాయకులు దస్తగిరి, రాంభూపాల్‌రెడ్డి, అశోక్, నిరంజన్‌నాయక్, సురేష్‌గౌడ్, శ్రీను, తిరుపతినాయక్, ఆనంద్, పాండు, శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

పంటల రక్షణకు చర్యలు తీసుకోవాలి



వెల్దండ: పంటల రక్షణకు అధికారులు చర్యలు తీసుకోవాలని రైతులు కోరారు. మండలంలోని పోతేపల్లి, లింగారెడ్డిపల్లి గ్రామాల్లో కేఎల్‌ఐ కాల్వ నీరు చేరడంతో పంటలు నష్టపోతున్నట్లు రైతులు ఆందోళనకు గురయ్యారు. బుధవారం కేఎల్‌ఐ అధికారులకు సమాచారం ఇచ్చారు. కేఎల్‌ఐ డీ–82 కాల్వలో భాగంగా ప్యాకేజి నంబర్ 29 కాల్వ ద్వారా నీరు ఉధృతంగా ప్రవహిస్తోందని పనులు అసంపూర్తిగా ఉండడంతో నీరు పంట పొలాలకు చేరుతుందని రైతులు వివరించారు. దీంతో సాగుచేసిన వేరుశనగ పంటలు దెబ్బతింటున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. అధికారులు పంటలను పరిశీలించి సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

విధుల్లో చేరిన కొత్త ఉపాధ్యాయులు


నూతన ఉపాధ్యాయురాలు కె.స్వప్నకు ఆర్డర్ కాపీ అందజేస్తున్న ఎంఈఓ భాస్కర్‌రెడ్డి


కల్వకుర్తిలో నియామక పత్రాలు అందిస్తున్న ఎంఈఓ శంకర్‌నాయక్

నాగర్‌కర్నూల్: కొత్తగా విధుల్లో చేరిన ఉపాధ్యాయులు అంకితభావంతో పని చేస్తూ విద్యాభివృద్ధికి కృషి చేయాలని ఎంఈఓ భాస్కర్‌రెడ్డి అన్నారు. జిల్లా మొదటి ర్యాంకు (84.90) సాధించిన కె.స్వప్నతో పాటు నూతన ఉపాధ్యాయులకు నియామక పత్రం అందజేశారు.

కల్వకుర్తిరూరల్: డీఎస్సీలో నూతనంగా ఉద్యోగాలు సాధించిన ఉపాధ్యాయులు బుధవారం విధుల్లో చేరారు. బుధవారం పట్టణంలోని ఎంఈఓ కార్యాలయంలో ఎంఈఓ శంకర్‌నాయక్ 8 మంది ఉపాధ్యాయులు నియామకపత్రాలు అందజేశారు. మెరుగైన విద్యాబోధన అందించాలని ఎంఈఓ సూచించారు.

కొల్లాపూర్: మండలంలో ప్రభుత్వ ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలల్లో కొత్తగా మొత్తం 23 మంది ఉపాధ్యాయులు విధుల్లో చేరినట్లు మండల విద్యాధికారి ఇమ్మానుయేల్ తెలిపారు.

లింగాల: మండలంలోని ఎమ్మార్సీ కార్యాలయంలో 28 మంది నూతన ఉపాధ్యాయులకు మండల విద్యాధికారి బషీర్ అహ్మద్ నియామక పత్రాలను అందజేశారు. అంబట్‌పల్లి జెడ్పీహెచ్‌ఎస్ హెచ్‌ఎం ఇందిర, పీఆర్టీయూ మండల శాఖ అధ్యక్షుడు పాండుగౌడు, ప్రధాన కార్యదర్శి శివప్రసాద్, కార్యదర్శి రాందాస్, ఎమ్మార్సీ సిబ్బంది సాయికిరణ్, శ్రీనివాసులు, విష్ణు, హరిలాల్ తదితరులు పాల్గొన్నారు.

అమ్రాబాద్: స్థానిక ఎంమార్సీలో నూతనంగా 16 మంది ఉపాధ్యాయులకు మండల విద్యాధికారి బాలకిషన్ నియామక పత్రాలు అందజేశారు.

తెలకపల్లి: మండల కేంద్రంలోని ఎమ్మార్సీ భవనంలో నూతనంగా నియామకమైన 13 మంది ఉపాధ్యాయులకు ఎంఈఓ శ్రీనివాస్‌రెడ్డి నియామక పత్రాలు అందజేశారు. 7 మంది ఎస్జీటీలు, 5 మంది స్కూల్ అసిస్టెంట్‌లు, ఒక హిందీ పండిట్ ఉపాధ్యాయులు ఉన్నారు.

పెద్దకొత్తపల్లి: నూతనంగా నియామకం అయిన 19 మంది ఉపాధ్యాయులకు ఎంఈఓ శ్రీనివాస్‌రెడ్డి నియామక పత్రాలను అందజేశారు. అనంతరం పీఆర్టీయూ నాయకులు సన్మానించారు.

కోడేరు: మండలంలో నూతనంగా వచ్చిన ఉపాధ్యాయులకు ఎంఈఓ భాస్కర్‌రెడ్డి నియామక పత్రాలు అందజేసి పలు సూచనలు, సలహాలు ఇచ్చారు. విధుల్లో నిర్లక్ష్యం వహించరాదని కోరారు.

పారిశుద్ధ్యానికి ప్రభుత్వం ప్రాధాన్యం



చారకొండ: పారిశుద్ధ్యానికి ప్రభుత్వం ప్రాధాన్యం ఇస్తోందని ఎంపీఓ వెంకటేష్ అన్నారు. మండలంలోని గొకారం, చంద్రాయన్‌పల్లి గ్రామాలను బుధవారం ఆయన సందర్శించారు. గ్రామాల్లో పరిసరాల, అభివృద్ధి పనులను పరిశీలించారు. అనంతరం పంచాయతీ రికార్డులను తనిఖీ చేశారు. ఇంటిపన్ను వసూలు చేయాలని కార్యదర్శులకు సూచించారు. గ్రామాల్లో ఉన్న దుకాణాలకు ట్రేడ్ లైసెన్స్ తప్పనిసరిగా ఇవ్వాలన్నారు. పంచాయతీ కార్యదర్శులు చెన్న కేశవులు, శ్రీపని ఉన్నారు.

పశుసంపదను కాపాడుకుందాం

చారకొండ: పశుసంపదను కాపాడుకుందామని మండల పశువైద్యాధికారి శివకుమార్ అన్నారు. బుధవారం మండల కేంద్రంలో పశువులకు గాలికుంటు నివారణ టీకాలను వేశారు. వచ్చే నెల 14 వరకు పశువులకు టీకాలు వేస్తామని పేర్కొన్నారు. కార్యక్రమంలో వీఎల్‌ఓ షేక్ మదర్, సిబ్బంది శివరాం తదితరులు ఉన్నారు.

వెల్దండ: పశువులకు గాలికుంటు నివారణ టీకాలు వేయించాలని ఇన్‌చార్జ్ డాక్టర్ శ్రీనాథ్ పేర్కొన్నారు. మండలంలోని అజిలాపూర్, తిమ్మినోనిపల్లి, బుడ్డోనిపల్లి తదితర గ్రామాల్లో పశువులకు టీకాలు వేశారు. మూడు గ్రామాల్లో మొత్తం 1268 పశువులకు టీకాలు వేసినట్లు తెలిపారు. సిబ్బంది నరేష్ రెడ్డి, వెంకన్న, రియాజ్, నరసింహ, శ్రీను, తిరుపతయ్య, మొగులయ్య, బాలు, సాయిబాబా, విజయేందర్, తదితరులు ఉన్నారు.

ముష్టిపల్లిలో విషాదం

పెద్దకొత్తపల్లి: మండలంలోని ముష్టిపల్లి గ్రామానికి చెందిన ఇద్దరు వృద్ధ దంపతులు రంగారెడ్డి జిల్లా కందుకూరు సమీపంలో కొత్తగూడెంలో దారుణ హత్యకు గురయ్యారు. స్థానికుల వివరాల ప్రకారం ముష్టిపల్లి గ్రామానికి చెందిన మూగ ఊషయ్య(68), మూగ శాంతమ్మ(62) దంపతులు అదే గ్రామానికి చెందిన మనోహర్‌రావు పొలంలో కొన్నేళ్లుగా పనిచేస్తున్నారు. మనోహర్‌రావుకు కొత్తగూడెంలో ఫామ్‌హౌజ్ ఉంది. వృద్ధ దంపతులు ఎప్పటిలాగే ఫామ్‌హౌజ్ వద్దకు వెళ్లారు. అక్కడ గుర్తుతెలియని వ్యక్తులు వృద్ధులను హత్య చేశారు. మృతదేహాలు గురువారం ఉదయం ముష్టిపల్లికి తీసుకురానున్నారు. మృతులకు నలుగురు కుమార్తెలు, ఒక కుమారుడు ఉన్నారు. బాధిత కుటుంబాన్ని పలువురు స్థానిక నాయకులు పరామర్శించారు.

ముసురు వర్షం.. తడిసిన ధాన్యం

కొల్లాపూర్: పట్టణంలో బుధవారం రోజంతా విడతల వారీగా తుంపర వర్షం పడింది. సాయంత్రం కొంత సమయం భారీ వర్షం కురిసింది. వర్షం కారణంగా మార్కెట్ యార్డులో రైతులు ఆరబెట్టిన మొక్కజొన్న ధాన్యం తడిసింది. కొందరు రైతులు ముందస్తుగా కవర్లు కప్పి ధాన్యాన్ని కాపాడుకున్నారు. ముసురుతో మొక్కజొన్న ధాన్యం బూజు పట్టే అవకాశం ఉందని రైతులు వాపోతున్నారు. తేమశాతంతో సంబంధం లేకుండా ధాన్యం కొనుగోలు చేయాలని రైతులు కోరుతున్నారు.

వరి పంటలో సస్యరక్షణ చర్యలు

చారకొండ: వరిపంటలో సస్యరక్షణ చర్యలు చేపట్టాలని సిర్సనగండ్ల వ్యవసాయ విస్తరణ అధికారి వంశీ అన్నారు. మండలంలోని సిర్సనగండ్ల క్లస్టర్‌లో రామచంద్రాపురంలో వరి పంటను ఆయన బుధవారం పరిశీలించారు. వరి పంటకు ఆకు ముడుత పురుగు, సుడిదోమ ఎక్కువగా ఆశించడంతో పంట దిగుబడిపై ప్రభావం పడుతుందని పంట సస్యరక్షణ చర్యలు తీసుకోవాలని రైతులకు సూచించారు.

బీపీఎంలకు సన్మానం



లింగాల: మండలంలోని సబ్ పోస్టాఫీసు పరిధిలోని బీపీఎంలు బాలాజీ(దారారం), ప్రశాంత్(వల్లభాపూర్)లను బుధవారం ఘనంగా సన్మానించారు. ఆర్‌పీఎల్‌ఐ ప్రీమియం రూ. 2 లక్షలు పైగా చెల్లించిన ఇద్దరు బీపీఎంలను సన్మానించారు. ప్రతి బీపీఎం కష్టపడి ఆర్‌పీఎల్‌ఐ ప్రీమియంలు చేయిస్తే గుర్తింపు లభిస్తుందని వనపర్తి డివిజన్ పోస్టల్ శాఖ ఎస్పీ భూమన్న అన్నారు. ప్రతి బీపీఎం టార్గెట్‌ను పూర్తి చేసి ముందుకు పోవాలని ఎస్పీ కోరారు. కార్యక్రమంలో నాగర్‌కర్నూల్ సబ్ డివిజన్ పోస్టల్ ఇన్‌స్పెక్టర్ సృజననాయక్, ఎస్పీఎం మాచర్ల, ఖాన్, సిబ్బంది పాల్గొన్నారు.

రైతు సంక్షేమ కమిషన్ చైర్మన్ వినతి

అచ్చంపేట రూరల్: హైదరాబాద్‌లో వ్యవసాయ, రైతు సంక్షేమ కమిషన్ చైర్మన్ కోదండారెడ్డిని బుధవారం టీపీసీసీ ఎస్‌ఆర్‌ఐ సెల్ అడ్వయిజరీ కమిటీ మెంబర్ బొజ్జ అమరేందర్‌రెడ్డి మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా నల్లమల ప్రాంతంలోని రైతుల సమస్యలను ఆయన దృష్టికి తీసుకెళ్లారు. సానుకూలంగా స్పందించారు.